క్లుప్తంగా

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు



వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను అదుపులోకి తీసుకొని వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, ఎన్టీ రాబిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బంది కుక్కలను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వాటిని కొత్తపేటలో ఉన్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్‌కు తరలించారు. అక్కడ సంతాన నిరోధక శస్త్ర చికిత్స అనంతరం ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్యంగా ఉన్న కుక్కలను ఎక్కడి నుంచి అదుపులోకి తీసుకున్నారో అక్కడే విడిచి పెట్టే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయడం వల్ల కొంత మేర కుక్కల సంతానాన్ని నిరోధించగలిగామని చెప్పారు.

మహిళా చట్టాలపై అవగాహన



మహిళల భద్రతపై మాట్లాడుతున్న విద్యార్థి

నెల్లిమర్ల: మహిళ చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. మండలంలోని జరజాపుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌ఐ బి.గణేష్ మహిళలకు వేధింపులు, భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్వీయ రక్షణ అవసరమన్నారు. పని ప్రదేశాల్లో భద్రతపై దృష్టి సారించి మహిళలు వేధింపులకు గురికాకుండా ఎదుర్కొనాలన్నారు. సమాజంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పిల్లలను సమాన దృష్టితో చూడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఆడ, మగ పిల్లలను సమాన దృష్టితో చూడాలని ఏసీడీపీఓ తవిటినాయుడు, 4వ సెక్టార్ సూపర్‌వైజర్ టి.త్రినాథ అన్నారు. పట్టణంలోని కంటోన్మెంట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనరిక వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపారు. పుట్టే పిల్లలు అంగవైకల్యంతోనూ, అనారోగ్యంతో పుట్టే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలను కూడా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్

విజయనగరం క్రైమ్/టౌన్: ద్విచక్ర వాహన చోదకులంతా వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనర్ డి.మణికుమార్ విజ్ఞప్తి చేశారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించని 30 మంది వాహన చోదకులను గుర్తించారు. వీరందరికీ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. తమ కుటుంబం కోసం, ఏదైనా ప్రమాదం సంభవించినపుడు ప్రాణాలను కాపాడుకోవడం కోసం హెల్మెట్ ధరించడం అవసరమని వారికి అవగాహన కల్పించారు. వచ్చే వారం రోజుల పాటు జిల్లాలో హెల్మెట్ ధారణపై తనిఖీలు కొనసాగిస్తామని ఉప రవాణా కమిషనర్ చెప్పారు.

ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలి



యూపీహెచ్‌సీలో ఆశవర్కర్ల ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: ఆశ వర్కర్లపై పని భారం పెరుగుతుందని, వేతనాలు మాత్రం పెరగడం లేదని, కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని ఆశ వర్కర్ల సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 6వ తేదీన చలో విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొంటామని, విధులకు హాజరు కాలేమని యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సునీత, పద్మ, కనకమహాలక్ష్మి, బంగారమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకానికి ఆదరణ

- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 850
- రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించింది 336 మంది
- ఇప్పటి వరకు అమర్చినవి 259
- దరఖాస్తు చేసుకుంటే అనుమతులిస్తామంటున్న అధికారులు



నగరంలోని ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

విజయనగరం: సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సూర్యఘర్ పథకానికి విజయనగరం జిల్లా కేంద్రంలో గృహ యజమానుల నుంచి ఆదరణ లభిస్తోంది. సామాన్యులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు వీలుగా అమలు చేస్తున్న కార్యక్రమానికి స్పందన లభిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటి పైకప్పుపై నుంచే విద్యుత్ ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్న విషయం విదితమే. దీని ద్వారా కలిగే ప్రయోజనాలపై ఆ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాన్నిస్తున్నాయి. సౌర విద్యుత్తును ప్రతి ఇంటికి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్తు పథకానికి విజయనగరం జిల్లా కేంద్రంలో వచ్చిన దరఖాస్తులే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. పథకం ద్వారా సౌర పలకల యూనిటును ఏర్పాటు చేసుకుని కరెంట్ నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అవసరం మేరకు వినియోగించుకుని మిగిలిన యూనిట్లను విక్రయించుకోవచ్చు. దీనికి కేంద్ర ప్రభుత్వమే రాయితీ అందించి, బ్యాంకు రుణాలను ఇప్పించి ఇంటిపై యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంది.

వచ్చిన దరఖాస్తులు 850.. బిగించినవి 259

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారిక లెక్కల ప్రకారం 60వేలకు పైగా భవనాలు ఉన్నాయి. అయితే విద్యుత్ శాఖ అధికారులకు ఇప్పటి వరకు 850 మంది దరఖాస్తు చేసుకున్నారు. 336 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. వాటిలో 259 యూనిట్‌లకు సంబంధించి అన్ని అనుమతులిచ్చి సోలార్ ప్యానెల్స్ బిగించినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించటం ద్వారా పథకం అమల్లో ప్రగతి సాధ్యపడుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

పెరుగుతోన్న దరఖాస్తులు

కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి విరివిగా రాయితీ రుణాలు అందిస్తోంది. ఇప్పటివరకు 259 యూనిట్లు ఏర్పాటు చేశాం. మరో 75 యూనిట్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొత్తంగా 850 మంది గృహ యజమానులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించింది 336 మంది మాత్రమే. ఏర్పాటు చేస్తున్న అన్నింటికీ కేంద్రం రాయితీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ పథకాన్ని అమలు చేస్తాం. 10వేల దరఖాస్తులు వచ్చినా అనుమతులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. విస్తృత ప్రచారం ద్వారా పథకాన్ని విద్యుత్తు వినియోగదారుల్లోకి తీసుకుపోతున్నాం. సందేహాలు ఉంటే ఏఈలను సంప్రదిస్తే వాటిని నివృత్తి చేస్తారు.

– కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం టౌన్

గరిష్టంగా రూ.78 వేల రాయితీ

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా కోటి గృహాలకు సౌర విద్యుత్తు ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల యూనిట్‌కు రూ.78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది. అందులో కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్టాప్ ఏర్పాటుకు రూ.1.45 లక్షలు ఖర్చవుతుంది. అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచికత్తు లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చునని అరబిందో ఫార్మా సీనియర్ జీఎం కమలాకర్‌రెడ్డి అన్నారు. అరబిందో ఫార్మా కంపెనీ 54వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 216 మంది శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో రక్త నిల్వలు కొరత కారణంగా మరియు రానున్న వేసవి దృష్ట్యా తలసేమియా పిల్లలు, గర్భిణుల కోసం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు శివవర్మ, అశోక్, శరత్, రఘు, విజయ్, చంద్రిక, విజయబ్యాంక్ మేనేజర్ పి.శివ, అరబిందో హెచ్‌ఆర్ రాము తదితరులు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచండి



విజయనగరంలో కొన్ని చోట్ల ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయని, వీటిని పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. 34వ డివిజన్‌లో వివిధ విభాగాల అధికారులతో ఆయన మంగళవారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, నీటి సరఫరా, రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలను గమనించారు. ఖాళీ స్థలాల పరిశుభ్రతకు ప్రత్యేకంగా పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

– విజయనగరం

ఇఫ్తార్ విందు



విజయనగరంలోని బాబామెట్టలో ఉన్న ఆధ్యాత్మిక సూఫీ క్షేత్రం హజరత్ ఖాదర్‌బాబా ఆలయ ఆవరణలో రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందును ఆలయ ధర్మకర్త డాక్టర్ ఖలీల్‌బాబు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు



డిప్యూటీ మేయర్ శ్రావణిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

- కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఉల్లి వీధి సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన శ్రీ వాసవి ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా వాసవి మాత చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా సామాజిక సేవలోను ముందుంటారని అన్నారు. విజయనగరం ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ, హాస్టల్ భవనం నిర్మాణం చేయడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, నిరుపేద ఆర్యవైశ్య మహిళల వివాహాలకు ఆర్థిక సహాయం చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. ఇవి ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. సంఘం అధ్యక్షులు చెన్నయశెట్టి మాట్లాడుతూ తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు సభకు తెలియజేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులను సభకు పరిచయం చేస్తూ, అధ్యక్షునిగా వి.వి.సత్యనారాయణ(ఏడుకొండలు), కార్యదర్శి పచ్చిగుళ్ల రామారావు, కోశాధికారి వళ్ళంపాటి ఉపేంద్రలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణిని సత్కరించారు. ప్రాజెక్ట్ చైర్మన్‌లుగా చెన్నా బుచ్చి జనార్ధనరావు, కొల్లా వెంకటరాజు, కట్టమూరి రత్నారావు వ్యవహరించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవి క్లబ్, వుడాకాలనీ, తోటపాలెం, ఫూల్‌బాగ్, కస్పా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంఘం అభివృద్ధికి తోడ్పడుతున్న సభ్యులను సత్కరించారు.

కూటమి పాలనపై వెల్లువెత్తిన వ్యతిరేకత

విజయనగరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీ చేసిన గాదె శ్రీనివాసులనాయుడు అఖండ మెజార్టీతో విజయం సాధించటం పట్ల వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డోలా మన్మధకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన అభ్యర్థి ఘోర పరాజయం పొందటం ఉపాధ్యాయుల నిబద్ధతకు అద్దం పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా ఉపాధ్యాయులు ప్రతిఘటించి ప్రభుత్వ పాలన పట్ల వారికున్న వ్యతిరేకతను గట్టిగా చెప్పారని పేర్కొన్నారు. మేధావులైన ఉపాధ్యాయులు ఇటువంటి తీర్పునివ్వటం ప్రభుత్వం పని తీరును చెప్పకనే చెబుతుందన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామి సన్నిధిలో అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామిని నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసాను భక్తి శ్రద్ధలతో పఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నామని ఆ శాఖ డీఈఈ పి.త్రినాధరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్ పురం, తుమ్మలపేట, చిన్న బూరాడపేట, పారసాం, గెద్దపేట, భూపాలపురం, ఆనందపురం, తాళ్లపూడి పేట, పెద్ద బూరాడపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృత్తికారులకు రుణాలు మంజూరు చేయాలి



సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావుతో చర్మకారులు, డప్పు కళాకారులు

విజయనగరం అర్బన్: జిల్లాల్లోని చర్మకారులు మరియు డప్పు కళాకారులు, చర్మ శుద్ధి కార్మికులు, కబేళా వృత్తిదారులకు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వృత్తిలో స్థిరపడడానికి రూ.2లక్షల వరకు రుణాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి చర్మకారులకు చెప్పులు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. అర్హులైన డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అడ్డపువలస ప్రాంతంలో దాదాపు 25 ఎకరాల స్థలం లెదర్ పార్కుగా ఉందని, దాన్ని నిర్మించాలని కోరారు. కలెక్టర్‌ను వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు తదితరులు ఉన్నారు.

ప్రయోగాత్మక నైపుణ్యంతోనే ఉద్యోగ సాధన



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

భోగాపురం: ప్రతి విద్యార్థికి ఉద్యోగ సాధన కోసం ప్రయోగాత్మక నైపుణ్యం అవసరమని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివారావు అన్నారు. మండలంలోని బసవపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీలో రెండు రోజుల పాటు జరగనున్న నేషనల్ లెవెల్ టెక్ ఫెస్ట్ టెక్ విశిష్టత 2కె25 కార్యక్రమాన్ని ఆయన మంగంళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠ్య పుస్తకాల్లోని మూల సిద్ధాంతాలు వాటి ప్రయోగాత్మక నైపుణ్యాలపై అవగహన ఏర్పరుచుకోవాలన్నారు. విద్యార్థులకు తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు ప్రయోగశాల పరిజ్ఞానం కీలకమన్నారు. ఈ ఉత్సవానికి వివిధ కళాశాలల నుంచి 2 వేల మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శించిన సుమారు 82 ప్రాజెక్టులను ఆయన తిలకించారు. ఈ సాంకేతిక ఉత్సవంలో టెక్నికల్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్స్, ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రముఖులు పి.సుజాత, ఆర్‌వి.రాజ్‌కుమార్, డాక్టర్ వెంకటకృష్ణారావు, పి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

విజయనగరం టౌన్: జిల్లాలో ద్విచక్రవాహనదారులంతా తమ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనర్ డి.మణికుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని 50 మంది వాహనచోదకులను గుర్తించి, వారికి కార్యాలయం ఆవరణలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడం కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వచ్చే వారం రోజుల పాటూ జిల్లాలో హెల్మెట్ ధారణపై తనిఖీలు కొనసాగిస్తామన్నారు.

వాహనాలపై ట్యాక్స్‌లతో డ్రైవర్ల ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు, డ్రైవర్లు

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం టాటా మ్యాజిక్, ఆటో, పాసింజర్ వాహనాలపై గ్రీన్, రోడ్, లేబర్ ట్యాక్స్‌లు వేస్తూ ట్యాక్సు థర్డ్ పార్టీ ఇన్స్రూ భారీగా పెంచి డ్రైవర్ల రక్తాన్ని పిలుస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాక్స్‌లను నిరసిస్తూ నగరంలోని మయూర జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో కనీసం మోటార్ వెహికల్ డ్రైవర్ల సంక్షేమం కోసం చర్చించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వాహనమిత్ర రూ.15వేలు ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు మాట్లాడుతూ వాహనాల డ్రైవర్లపై ట్యాక్స్‌ల పేరిట ప్రభుత్వం దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. టోల్ ప్లాజా, జీఎస్టీ పన్నులను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు ఎం.చంద్ర, ఉపాధ్యక్షుడు బి.చిన్న, కార్యదర్శి బి.సంతోష్‌కుమార్, కోశాధికారి పి.సుధ, సభ్యులు టి.తిరుపతిరావు, మాక్సీక్యాబ్, ఆటో, జీపు, ట్యాక్సీల డ్రైవర్లు పాల్గొన్నారు.

పైడితల్లి ఆధ్యాత్మిక కళావేదిక వార్షికోత్సవం



పైడితల్లి అమ్మవారి ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాద్, తదితరులు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కళావేదిక ప్రథమ వార్షికోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెఎన్‌విడివి.ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలను దుశ్శాలువతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. మానాప్రగడ సాహితీ రచించిన పైడితల్లి అమ్మవారి ఆడియో సీడీని ఆవిష్కరించారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు డాక్టర్ మండపాక రవి నిర్వహించిన సంగీత కచేరీ ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, డాక్టర్ జక్కు రామకృష్ణ, ధవళ సర్వేశ్వరరావు, భానురాజా, ఏడుకొండలు, సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగ నివారణ

నెల్లిమర్ల రూరల్: రోగ నివారణకు ఆయిర్వేద వైద్యం ఎంతో మేలని సెంచూరియన్ వెల్‌నెస్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యాధులు వచ్చిన తరువాత జాగ్రత్తలు తీసుకోవడం కంటే అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయుర్వేదంలో పంచకర్మ బాగా ప్రసిద్ధి చెందిందని, వాటిని పాటించడం ద్వారా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మతల్లి సిరుల మహోత్సవం



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఎల్లమ్మతల్లి సిరుల మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వై.పైడిరాజు (వాలి), ఎర్రంశెట్టి సతీష్, రమణమూర్తి, రఘు తదితరులు పేర్కొన్నారు. స్థానిక మహారాజా సంగీత, నృత్య కళాశాల వద్దనున్న ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమ్మవారి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఐదో తేదీన ప్రత్యేకపూజలు, ఆరో తేదీన గురువారం తొలేళ్ల సంబరాలు, ఏడో తేదీన శుక్రవారం సిరిమాను మహోత్సవం ఉంటుందన్నారు. అదే విధంగా 27న మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.